www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 14 సెప్టెంబర్ 2023

వైసిపి ఐటి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ధర్మారెడ్డి



ధర్మారెడ్డి

ప్రజాశక్తి- రాయచోటి

వైసిపి ఐటి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా బుడ్డా ధర్మారెడ్డిని నియమించారు. బుధవారంరాష్ట్ర అధ్యక్షులు పోశంరెడ్డి సునీల్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీని ప్రకటించారు. రాష్ట్ర కార్యదర్శిగా ధర్మారెడ్డిని ప్రకటించారు. ధర్మారెడ్డి స్వగ్రామం మండలంలోని యండపల్లి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడమే కాక ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశానన్నారు. తన పదవికి న్యాయం చేయడంతోపాటు భవిష్యత్తులో వైసిపి అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన పార్టీ అనుబంధ విభాగాల కో-ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, వైసిపి ఐటి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పోశంరెడ్డి సునీల్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి బసిరెడ్డి సిద్ధారెడ్డి, మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా, ప్రత్యేక ప్రాధాన్యతతో నిర్వహించాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. బుధవారం తాడేపల్లి నుండి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రి నిర్వహించిన విసికి కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ హాల్ నుంచి కలెక్టర్ గిరీష, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. సిఎం విసి ముగిసిన అనంతరం ఆయన అందించిన మార్గదర్శకాల మేరకు వైద్యాధికారులు, సంబందిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30 తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఈ నెల 15వ తేదీ నుంచి వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లు పంపిణీ చేయాలన్నారు. 16వ తేదీ నుంచి ఏఎన్ఎంలు, సిహెచ్వోలు ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారిని వైద్య శిబిరాలకు పంపించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం లాంటిదని వైద్య అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వైద్యులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ క్యాంపులో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపులో పాల్గొనడం జరుగుతుందన్నారు. వైద్యులు రోగులను ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేసేటప్పుడు పేషెంట్ వివరాలు ఆరోగ్యశ్రీ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, సర్పంచ్ ఇతర ప్రజా ప్రతినిధులు అందరినీ ఆహ్వానించి భాగస్వామ్యం చేయాలన్నారు. క్యాంపు నిర్వహించే గ్రామాలలో ఒక రోజు ముందే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అదనంగా వైద్య సిబ్బంది కోసం నర్సింగ్ కళాశాలల విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి జిల్లా స్థాయి పైలట్ క్యాంపును ఈనెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య, అంగన్వాడీ, విద్యాశాఖ, పంచాయతీరాజ్ తదితర అనుబంధ శాఖల అధికారులు విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం పొందటం ఎలా అనే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఐసిడిఎస్ అధికారి ఎం.ధనలక్ష్మి, జిల్లాలోని సిడిపిపిలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

కరువు మండలాలను ప్రకటించాలి

- ఎపి రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఒంటిమిట్ట చెరువును పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, వెంటనే కరువు మండలాలను ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.నరసయ్య తెలిపారు. బుధవారం ఒంటిమిట్టలో అడగంటిన చెరువును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితితో రైతులు అరకొర పంటలు వేశారని తెలిపారు. అప్పులు చేసి వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వేసిన పంటలు ఎండు దశకు వచ్చాయని చెప్పారు. పత్తి, వేరుశనగ, మిర్చి, మొక్కజొన్న, ఆముదం, కంది, మినుము వంటిపంటలు కూడా సకాలంలో వర్షాలు లేక సగానికి సగం దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. బోరు బావుల కింద ఉన్న అరకొర పంటలను కాపాడుకుందామంటే విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదని విద్యుత్ కోతలతో ఉన్న కొద్దిపాటి పంటలు దెబ్బ తింటుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను రూపొందించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ప్రణాళిక లేమితో చోద్యం చూస్తోందన్నారు. కనీసం వేసిన పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇ-క్రాప్ నమోదు చేయటంలో కూడా సర్వర్, నెట్‌వర్క్ ప్రాబ్లం, యాప్ డౌన్లోడ్ కాకపోవడం వంటి కారణాలతో పంటల నమోదు సక్రమంగా చేయటం లేదని తెలిపారు. వర్షాభావంతో పంటలు దెబ్బతిన్న అన్ని ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా గుర్తించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని, నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటను బట్టి ఎకరాకు రూ.40 వేలు నుంచి రూ.50 వేల వరకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలు వేయని రైతులకు ఎకరాకు రూ.20 వేలు జీవన భృతిగా ఇవ్వాలన్నారు. రైతులు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని, కౌలు రైతులకు కౌలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకంలో అదనంగా 100 రోజులు పనులు పెట్టాలన్నారు. వ్యవసాయ మోటర్లకు 9 గంటల విద్యుత్ నిరంతరాయంగా అందించి ఉన్న పంటలను కాపాడాలని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికను రూపొందించి రబీలో పంటలు వేసేందుకు 90 శాతం సబ్సిడీతో రైతులకు ప్రభుత్వం విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమశిల వెనుక జలాల ద్వారా ఒంటిమిట్ట చెరువుకు పైపులైన్ ద్వారా నీటిని నింపి చెరువు ఆయకట్టు రైతులను కాపాడాలన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీన తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాకు రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు పుల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు రాము, నాయకులు వెంకటసుబ్బారెడ్డి, నరసయ్య, రవి పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి : యుటిఎఫ్

SAVE EDUCATION, SAVE CAMPUS, SAVE NATION
ROLL BACK NEP 2020.
RESTORE OPS
FILL ALL VACANT POSTS
REGULARISE ADHOC / CONTRACT TEACHERS
WITHDRAW CUET, NEET etc.
Withdraw NEP 2020

ఢిల్లీలో ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

దేశ విద్యా విధానానికి నష్టాన్ని చేకూర్చే జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.కె.జాబీర్ డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ హక్కుల్ని కాపాడే పాత పెన్షన్‌ను పునర్ధించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజీ, టీచర్స్ ఆర్గనైజేషన్, జాయింట్ ఫోరమ్ ఫర్ మూవ్మెంట్ ఆన్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్లకు లాభం చేకూర్చే ప్రైవేటీకరణకు దారి తీసే విద్య మొత్తం వ్యాపారమయం చేసే జాతీయ విద్యా విధానం వల్ల తీవ్ర నష్టమని, భవిష్యత్తులో కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కుగా ఉన్న పెన్షన్‌ని బిక్షగా మార్చి నూతన పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చి ఉద్యోగుల హక్కుల్ని అందించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్లకు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రకరకాల పేరు పెట్టినా పాత పెన్షన్ విధానానికి సాటి రావని పేర్కొన్నారు. వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ మొత్తాన్ని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి పరీక్షల విధానం పేరుతో రాష్ట్ర హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరిని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న రాజ్యాంగబద్ధ హక్కులను ఇవ్వాలన్నారు. నీట్ లాంటి పరీక్షలు రద్దు చేయాలన్నారు. విద్యను,యూనివర్సిటీలను,జాతిని ప్రవేటీకరణ నుంచి రక్షించాలని డిమాండ్ చేశారు.

వైవీయూ వార్షిక పరీక్షల్లో సంస్కరణలు : విసి

సమావేశంలో మాట్లాడుతున్న విసి సుధాకర్

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం వార్షిక పరీక్షల్లో సంస్కరణలు అమలు చేస్తున్నట్లు విసి ఆచార్య చింతా సుధాకర్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన తన చాంబర్లో కుల సచివులు ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి, అన్ని విభాగాల అధిపతులతో కలిసి బేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు ఒకే చోట నిర్వహించడం కాకుండా, ఆయా శాఖలలో నిర్వహించేలా వికేంద్రీకరణ దిశగా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇకపై ప్రతి డిపార్ట్మెంట్ వారి శాఖలోనే పరీక్షలు నిర్వహించాలన్నారు. సరికొత్త విధానంలో క్వశ్చన్ పేపర్ మేనేజ్మెంట్ సిస్టం అమలు చేస్తున్నామన్నారు. ప్రశ్నాపత్రం ఆన్‌లైన్‌లో సంబంధిత హెడ్లకు కొన్ని నిమిషాల ముందు అందుతుందని వాటిని ప్రింట్ చేసి విద్యార్థులకు అందించాల్సి ఉంటుందన్నారు. పరీక్షలు పూర్తి అయిన వారంలోపే ఫలితాలు ఇచ్చేలా మూల్యాంకనం చేయాల్సి ఉంటుందన్నారు. పరీక్షల ప్రారంభం నుంచి ఫలి తాలు ప్రకటించే వరకు రెగ్యులర్ అధ్యాపకులు ఎవ్వరు సెలవు తీసుకోకూడదని స్పష్టం చేశారు. క్వశ్చన్ పేపర్ మేనేజ్మెంట్ సిస్టం గురించి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి అవగాహన కల్పించారు. సమావేశంలో అన్ని శాఖల అధిపతులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

పేదల ఆత్మబంధువు 'చింతల'

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేద ప్రజల ఆత్మబంధువని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జన్మదిన సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి నిర్మల, సర్పంచ్ గంగులమ్మలతో కలిసి కేక్ కట్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. చింతలవారిపల్లె పంచాయతీ వైసిపి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరిదేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి, ప్రజలతో మమేకమై సేవలందిస్తున్న ఆదర్శ నాయకుడు ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి అని కొనియాడారు. పదవిలో ఉన్నా, లేకపోయినా నిత్యం నియోజకవర్గంలో ఉంటూ ప్రజలకు కష్టసుఖాల్లో అండగా ఉండే ప్రజా ప్రతినిధి రామచంద్రారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు రవినాయక్, కిరణ్ కుమార్, మహబూబ్ బాషా, రవి, రాయుడు, రవీంద్రారెడ్డి, సత్య, చికెన్ మస్తాన్, సైపుల్లా, రాజేష్, శ్రీనివాసులు, ముబారక్, రమేష్, చంద్ర, షామీర్ భాష, అహమద్ బేగ్, సుధాకర్, ఆనంద్, సురేష్ కుమార్‌రెడ్డి, శ్యామ్ పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు పటిష్ట చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

వినాయక చవితి ఉత్సవాలలో పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్‌పి బి.కృష్ణారావు అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన డీఎస్పీలు, సిఐలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి రోజున ఉత్సవాల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సూచించారు. వినాయక విగ్రహాలు, మండపాలు ఏర్పాటు చేసిన ప్రదేశాలలో భద్రతాపరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా నిత్యం అప్రమత్తంగా ఉండి కమిటీ సభ్యులు నిర్వాహకులు మండపాల వద్దే నిద్రించు కోనేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపకం జరగకుండా ఉండే విధంగా కమిటీ సభ్యులకు వివరించాలని కోరారు. ఎక్కడ కానీ డీజే సౌండ్ సిస్టంలు, రికార్డింగ్ డాన్సులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రదేశాలలో కరెంటు సౌకర్యం, గజాయితగాళ్లు, వైద్య సిబ్బంది, మంటలను ఆర్పే వస్తువులు సిద్ధంగా ఉంచుకోవాలని అలాగే రెవెన్యూ, పంచాయతీ, మున్సిపాలిటీ విభాగాలతో సమన్వయం చేసుకోని ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో మతసామరస్యంగా పండగను జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ విబి రాజ్ కమల్, డీఎస్పీలు సిఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి కృష్ణారావు

చంద్రబాబుపై అక్రమ కేసులు ఎత్తివేయాలి : ఆర్ఆర్

నిరసన దీక్షల్లో మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు ఎత్తివేయాలని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం టిడిపి కార్యాలయంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ నాయకుడు చంద్రబాబుపై అక్రమ కేసు బనాయించి రిమాండ్‌కు పంపడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా అనేకమంది శిక్షణ పొంది ఉపాధి పొందారున్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజులు ఖాదర్ బాషా, రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి వతన్ నిస్సార్, టిడిపి పట్టణ, రూరల్ అధ్యక్షులు ఎస్.ఖాదరవల్లి, మురికినాటి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** టిడిపిఅధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు ఆధ్వర్యంలో బుధవారం శ్రీ చైతన్య పాఠశాల పక్కన టిడిపి శ్రేణులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ మచ్చ లేని తమ నాయకుడు చంద్రబాబు పై అక్రమ కేసు బనాయించి రిమాండు కు పంపడం దుర్మార్గమైన చర్యన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా అనేకమంది యువత శిక్షణ పొంది ఉపాధి పొందారని, నిరాధార ఆరోపణలు నుండి బాబు త్వరలోనే మచ్చలేని నాయకుడిగా తిరిగి బయటకొస్తారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు, మండల రూరల్ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, మహిళా నాయకురాలు అనసూయమ్మ, పత్తిపాటి కుసుమకుమారి, జ్యోతి శివ పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి అటవీ భూముల సేకరణ : గిరీష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో రహదారుల అభివృద్ధికి అవసరమయ్యే అటవీ భూమిని తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న వివిధ జాతీయ రహదారుల అభివృద్ధి, ఇతర అంశాలపై అటవీ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తంబళ్లపల్లె-శివపురం రహదారి నుంచి మల్లయ్య కొండ వరకు, వంటి పలు రహదారుల అభివ ృద్ధి కోసం అవసరమయ్యే అటవీ భూమిని పొందేందుకు తగు నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాజంపేట మండలంలో బిఎస్ఎన్ఎల్ 4జి టవర్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన అటవీ భూమిని పొందేందుకు, బగ్గిడిపల్లి నుంచి ఎకరోపల్లి గ్రామం వరకు రహదారి అభివృద్ధి కోసం అవసరమైన అటవీ భూమిని పొందేందుకు అవసరమైన నివేదికలను త్వరగా పూర్తిచేయాలని రాజంపేట తహశీల్దార్‌ను ఆదేశించారు. చిట్వేలు మండలంలో గ్రామస్తులు ఇచ్చిన వివిధ అభ్యర్థనలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా అభ్యర్థనలకు సంబంధించి నివేదికలను త్వరగా సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా అటవీ శాఖ అధికారి, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి పాల్గొన్నారు.

21 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

లయన్స్ కంటి హాస్పిటల్

కంటి ఆపరేషన్లు చేసుకున్న వారితో వైద్యులు

లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లె ఆధ్వర్యంలో లయన్స్ కంటి ఆసుపత్రిలో బుధవారం 21 మందికి ఉచిత కంటి శుక్లం శస్త్ర చికిత్సలు నిర్వహించామని అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి తెలిపారు. విజయ వంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేసుకొన్న వారిని పరీక్షలు అనం తరం వారికి ఇంటికి పంపడం జరిగిందని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ కంటి చూపు మంద గించడం ద్వారా గ్రామీణ, పట్టణ పేద ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండటం కోసం ప్రత్యేక విజన్ తో విస్త ృతంగా ఉచిత కంటి పరీక్ష శిబిరాలు ఏర్పాటు చేసి,శుక్లం వున్న వారిని గుర్తించి వారికి ఆపరేషన్ చేసి వారి కుటుంబానికి వెలుగును అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంజెఎఫ్, పిఆర్ఒ గౌతమ్‌రెడ్డి, ప్రసాదరావు, లయన్ డాక్టర్ నివేదిత, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిసిసేన జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలను జిల్లా బిసి సేన యువజన అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి సేన రాష్ట్ర అధ్యక్షులు సొంటి నాగరాజు పిలుపు మేరకు కృష్ణయ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం, నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. నాలుగు దశాబ్దాలుగా నుంచి నిరంతరం బిసిల హక్కుల కోసం, వాటి సాధన కోసం పనిచేస్తూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో బిసిల పెద్దదిక్కుగా నిలిచారని కొనియాడారు. నిరంతరం బిసిల సంక్షేమం, అభ్యున్నతి కోసం పరితపిస్తున్న ఆర్.కృష్ణయ్య నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో ఉండాలని, భవిష్యత్తులో రాజకీయంగా ఉన్నత పదవులని అలంకరించాలని యువజన విభాగం తరపున ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సుధీర్, భాను, విజయ్ కుమార్, లక్ష్మీనారాయణ, యుగంధర్ బాబు, వెంకటేష్, అశోక్, ఆటో వెంకటేష్, బి.కే.పల్లి రెడ్డిశేఖర్, సుబ్రహ్మణ్యం, నాగరాజ, హుస్సేన్, జగన్ కాలనీ రమణన్న, లోకేష్ పాల్గొన్నారు.

MADANAPALLE
manipal hospitals

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్లు నాగశ్రీనివాస్, శివారెడ్డి

అత్యాధునిక విధానంతో మెగా వైద్య శిబిరం

- వైద్యులు డాక్టర్ ఎ.నాగశ్రీనివాస్,శివారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గుండె, కీళ్లకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న వారి కోసం అధునాతన వైద్య విధానాలతో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని బెంగళూరు నగరంలోని మణిపాల్ హాస్పిటల్స్ వైట్ ఫీల్డ్ ప్రసిద్ధిగాంచిందని ఆ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎ.నాగశ్రీనివాస్, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ డాక్టర్ శివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హృదయ సంబంధమైన ధమనులు, ప్రారంభ దశ ఆర్థరైటిసుని సంక్లిష్ట బ్లాకులను పరిష్కరిస్తామన్నారు. పట్టణంలోని శ్రీనివాస ఆసుపత్రిలో ప్రతి నెల రెండవ బుధవారం ఒపిడి సదుపాయం కలదన్నారు. త్వరలోనే గుండె జబ్బులకి సంబంధించిన ఒపిడిని ప్రారంభిస్తామన్నారు. హృదయ సంబంధమైన సంరక్షణలో సాంకేతిక పరంగా కొత్త, సురక్షితమైన అభివృద్ధి గురించి నొక్కి వక్కాణించారు. ఇంట్రాకోరోనరీ ఫిజియాలజీ అనే కొత్త సాంకేతికత రావడంతో, నాళాలు సంకుచితమయ్యే నిజమైన ప్రాముఖ్యతను ఖచ్చితంగా అంచనా వేయగలమని, తద్వారా అనవసరంగా స్టెంట్లు వేయడం లేదా బైపాస్ సర్జరీలకు సూచించడాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. త్వరలో పట్టణంలో మణిపాల్ ఆసుపత్రి వైట్ ఫీల్డ్ వారి సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించబోతున్నట్లు ఆసుపత్రి పిఆర్ఒలు అరుణ్, కార్తీక్, నరసింహలు వెల్లడించారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వానికి సంక్షేమ వసతి విద్యార్థుల సమస్యలు పట్టడం లేదని పిడిఎస్‌యు జిల్లా నాయకులు గణేష్, రాజంపేట డివిజన్ నాయకులు పృథ్వీ కుమార్ అన్నారు. రాజంపేట డివిజన్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం పూర్తిగా విస్మరించారని నిరసిస్తూ ఎఎస్‌డబ్ల్యుఒ కార్యాలయం ఎదుట పిడిఎస్‌యు ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజంపేట డివిజన్ పరిధిలో ఉన్న ఎఎస్‌డబ్ల్యుఒ కార్యాలయం సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం-1 శిదలావస్థకు చేరుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఎఎస్‌డబ్ల్యుఒ ప్రేమ్ సాగర్ మరియు వసతి గృహ అధికారి రామాంజనేయులు పూర్తిగా విఫలం చెందారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కళాశాల గృహం అద్దె భవనంలో కొనసాగుతుందని, ఇందువల్ల విద్యార్థినీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బాలికల వసతి గృహాల ఎదుట సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎఎస్‌డబ్ల్యుఒ ప్రేమ్ సాగర్ రాజంపేటలో అతను బాధ్యతలు చేపట్టినప్పటి నుండి కేవలం తన కార్యాలయంలో కుర్చీకే పరిమితమయ్యారని, ఇంతవరకు తన పరిధిలో ఉన్న ఏ ఒక్క ఎస్సి హాస్టల్ ను తనిఖీ చేసిన దాఖలాలు లేవని తెలిపారు. కావున స్థానిక ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జున రెడ్డి స్పందిస్తూ నియోజవర్గంలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ, గురుకుల, కస్తూర్బా వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ మరియు కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట పిడిఎస్‌యు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాజంపేట పట్టణ నాయకులు హరికృష్ణ, ప్రేమ్ కుమార్, వెంకటేశ్వరరాజు, హరేంద్ర, నరసింహ, చిన్న వర్ధన్ రెడ్డి, వంశీకృష్ణ, చాణిక్య పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న పారిశుధ్యకార్మికులు

సమస్యను పరిష్కరించండి

- కమిషనర్‌కు పారిశుధ్య కార్మికుల వినతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని నగర పంచాయతీ కమిషనర్ మనోహర్ పారిశుద్ధ్య కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కమీషనర్‌కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా తమ ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నామని అన్నారు. తమ శ్రమకు తగ్గ ఫలితం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని,విన్నవించిన సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి చొరవ చూపుతానని కమిషనర్ హామీనిచ్చారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-కలకడ

మాట్లాడుతున్న ఎస్ఐ తిప్పేస్వామి

వినాయకచవితి పండుగ సందర్భంగా గ్రామాలలో విగ్రహణం ఏర్పాటు చేయుటకు స్థానిక పోలీస్ స్టేషన్ నుండి అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్ఐ తిప్పే స్వామి తెలిపారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు స్థానిక ఎస్ఐ నుంచి అనుమతుల పొందిన అనంతరం విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. అనుమతులు లేకుండా విగ్రహం ఏర్పాటు చేసిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాలలో ఎన్ని విగ్రహాలు ఏర్పాటు చేస్తారో అంతమంది అనుమతులు పొందాలని తెలిపారు. విగ్రహ మండపాల వద్ద ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకుంటున్న కమిటీ సభ్యులు చూసుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. విగ్రహాలు ఏర్పాటులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు సామరస్యంగా జరుపుకోవాలని సూచించారు.

ముగిసిన పల్లెబాట

ప్రజాశక్తి- బి.కొత్తకోట

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహించిన పల్లెబాట కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఎంపిడిఓ శంకరయ్య పేర్కొన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాలమేరకు మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, సేవల గురించి తెలుసుకున్నామన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందని వారి గుర్తించి ప్రభుత్వ పథకాలకు భాగస్వాములను చేశామన్నారు. ఆగస్టు 21 నుంచి ఈనెల 12వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంలో చేసిన ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులకు ప్రత్యేక ఆహ్వానితులు, కో-ఆప్షన్ మెంబర్లకు ,ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాల సిబ్బంది, వాలంటీర్ల కృషి అభినందనీయమన్నారు. జగనన్న చైతన్య వాహనంతో పాటల కచేరితో మాకు అలుపు లేకుండా సహరించిన బయప్పగారిపల్లి సర్పంచ్, ఎమ్మెల్యే పి.ఎ.మస్తాన్, స్థానిక వైసిపి నాయకులకు దన్యవాదాలు తెలిపారు.

బండెన్నస్వామి ఆలయంలో చవితి వేడుకలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల పరిధిలోని బీరంగి పంచాయతీ, గూగూటికోనలో ని బండెన్నస్వామి ఆలయంలో వినాయక చవితి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు పండుగలు నిదర్శనమన్నారు. అన్ని మతాలవారు సోదరుభావంతో పండు గలను జరుపుకోవడం గొప్పతనమన్నారు. గూగూటికోనలో తొలి పూజలందు కునే బొజ్జ గణపయ్య ఉత్సవాలను నిర్వహించుకోవడం ఆనవాతీగా వస్తుం దన్నారు. ఈనెల 18న పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తా మన్నారు. కులమతాలకతీతంగా మండలంలోని ప్రజలు వినాయక చవితి వేడుకలకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సూపర్వైజర్

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దమండ్యం

పౌష్టిక ఆహారం సకాలంలో తీసుకున్నట్లయితే వ్యాధి నిరోధక శక్తి అధికం కావడంతో వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ కలిచర్ల సెక్టార్ సైపర్వైజర్ ఎస్.నౌజియాబేగం పేర్కొన్నారు. బుధవారం కోటకడపల్లి, గుర్రంవాండ్ల పల్లి అంగన్వాడీ సెంటర్‌లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్‌ను గర్భిణులు, బాలింతలకు అందించాలన్నారు.అనంతరం గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను ఏర్పాటు చేద్దాం

ప్రజాశక్త-మదనపల్లె అర్బన్

వినాయక పండుగ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడాలని ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణయ్య, కళాశాల కరస్పాండెంట్ పి.ఉదయ భాస్కర్‌లు తెలిపారు. బుధవారం స్థానిక మిషన్ కాంపౌండ్‌లో గల శ్రీ విశ్వహిత డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మట్టి వినాయక విశిష్టత, పర్యావరణం కాపాడడం అనే నినాదంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంకమట్టి కాకుండా పిఒపితో విగ్రహాలను తయారు చేయడం సరికాదని అన్నారు. మట్టి నీటిలో వెంటనే కరిగిపోతుందని, ప్లాస్టర్ నీటిలో తేలికగా కరుగదని, అందువల్ల విగ్రహం నిమర్జనం తర్వాత నీటిపై తేలుతుందన్నారు. దీనివల్ల పర్యావరణానికి ఎంతో ముప్పు తెచ్చిపెడుతుందన్నారు. మట్టి వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయకచవితి శుభాకాంక్షలు
మట్టివినాయకుని వాడుదాం! పర్యావరణాన్ని కాపాడుదాం!!
శ్రీ విశ్వహిత డిగ్రీ కళాశాల
ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజల వద్దకే ఆరోగ్య సేవలు

ప్రజాశక్తి-రామాపురం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపిపి జనార్ధన్‌రెడ్డి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకంతో ప్రజల వద్దకే ఆరోగ్య సేవలు అందుతున్నాయని మాజీ ఎంపిపి, వైసిపి మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని అన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువుకు ప్రతి నెల ఒకటవ తేదీనే ఇళ్ల వద్దఏ ఫింఛను అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అమ్మఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాలో రూ.15వేలు జమ చేస్తూ విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. జగనన్న చేయూతతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు లభించాయని అన్నారు. రైతభరోసా ద్వారా పంటలసాగుకు, ఎరువుల కొనుగోలు ఉపయుక్తమవుతుందని చెప్పారు. వైఎస్ఆర్ ఆరోగశ్రీ ద్వారా పేదలందరికీ ఉచిత వైద్య అందుతుందని అన్నారు.కర్షకులు, కార్మికులు, యువజనుల సంక్షేమానికి ప్రభుత్వ పెద్దపీట వేస్తోందన్నారు. 104 ద్వారా గ్రామాలలో ఇళ్ల వద్దకే వైళ్లి వైద్యలు సేవలు అందిస్తున్నారని అన్నారు. ఫ్యామిటీ ఫిజీషియన్ ద్వారా ప్రజలకు వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించి వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మండల ప్రత్యేక అధికారి సృజన, ఎంపిడిఒఇ హైదర్‌వలీ, మండల వైద్యాధికారి విజయకుమార్, తహశీల్దార్ కిషోర్‌కుమార్, వైసిపి రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ సూరం వెంకట సుబ్బారెడ్డి, సర్పంచులు అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ముంగం సుబ్బయ్య, ముంగర సుబ్బయ్య, ఆంజనేయులు, సచివాల సిబ్బంది, వైసిపి నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

రాయితీ ఉలవలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రైతు సంక్షేమమే ప్రభత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. బుధవారం రెడ్డివారిపల్లి గ్రామ సచివాలయం వద్ద మండల వ్యవసాయ అధికారి మురళిమోహన్, సర్పంచ్ రెడ్డమ్మ, నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై ఉలవ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎడిఎ దీక్షాకుమారి, ఎంపిపి నరసింహులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికా రం చేపట్టిన నాటి నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. అదే విధంగా రైతుల అభి వృద్ధిని ఆకాంక్షిస్తూ రైతు భరోసా, పంటలబీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి రైతులకు నేరుగా అందిస్తున్నారని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్లో వేరు శనగ పంటలు సాగు చేయని రైతులకు, బీడుగా ఉన్న భూములలో వర్ష ఆధా రంగా ఉలవ పంటను సాగు చేయడా నికి ప్రభుత్వం రాయితీపై ఉలవ విత్త నాలను అందిస్తోందన్నారు. ఒక్కొక్క రైతుకు రూ.1080లువిలువగల పది కిలోల బస్తాను 80 శాతం రాయితీతో కేవలం రూ.216 లకు అంది స్తుంద న్నారు.1600 మంది రైతులు ఉలవ విత్తనాల కోసం ఇదివరకే రిజిస్ట్రే షన్ చేసుకోవడం జరిగిందని, వారందరికీ ఉలవలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.అవసరమైన రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకుని ఉలవలను తీసుకొని సద్వినియోగం చేసుకో వాలన్నారు.

లబ్ధిదారులకు పింఛన్లు

మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే నవాజ్‌బాషా పంపిణీ చేశారు. రెడ్డివారిపల్లి సచివాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని రెడ్డివారిపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన 28 వివిధ పింఛన్లను పింఛనుదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి, మండల ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్ రెడ్డి, తమశీల్దార్ సిఆర్ మంజుల, ఎంపిడిఒ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి ఎర్రమల్లయ్య నాయుడు, సర్పంచులు సుబ్రమణ్యం, చెంద్రాయుడు, వైసిపి నాయకులు నరేంద్రరెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పాఠశాల క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-వీరబల్లి

రామసముద్రం : బాస్కెట్‌బాల్ జట్టుతో ఉపాధ్యాయులు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు బుధవారం అటహాసంగా ప్రారంభమయ్యాయి. మండల స్థాయిలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ క్రీడా పోటీలను ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు వీరనాగిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. మండల స్థాయిలో 6 నుండి పదవ తరగతి వరకు చదువుతున్నవిద్యార్థులకు పాఠశాల స్థాయిలో అండర్-14, అండర్-17 విభాగాల్లో తొమ్మిది క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విద్యార్థులు ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. మండల స్థాయిలో కబడ్డీ ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికా యిట్‌బాల్, బ్యాడ్మింటన్, షటిల్‌బ్యాడ్మింటన్, యోగ, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహిం చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లేశ్వరి, వైద్యాధికారి వినయ్‌బాబు, ఎంఇఒ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు గంగాదేవి, పాఠశాల కమిటీ చైర్మన్ ఇర్షాద్, విఆర్‌డి ఎస్ సంస్థ అధ్యక్షులు సురేంద్రరెడ్డి, మండలస్థాయి స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ వేణు మాధ వరాజు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు రవీంద్రరాజు, మదన్మోహన్‌రెడ్డి , ఉమా దేవి, శేఖర్, పార్వతి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.**రామసముద్రం** : మండలంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం అండర్-14 వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో చెంబకూరు, అరికెల, కె.సి పల్లి, మట్లవారిపల్లి, రామసముద్రం, కెజిబివి పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మునస్వామి నాయక్ , మండల స్థాయి పిఇటి, పిడీలు పాల్గొన్నారు.**రాజంపేట అర్బన్ :** ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమని ఆధ్వర్యంలో అండర్ -14, అండర్-17 క్రీడా పోటీల ఎంపికలు బుధవారం ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవ వేడుకలకు ఎంఇఒ రఘునాథరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, టెన్ కాట్, బాల్ బ్యాడ్మింటన్ లలో ఎంపికలు నిర్వహించారు. **నందలూరు:** పాఠశాల స్థాయి నుండే ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపట్ల ఆసక్తి చూపి క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నందలూరు ఎంఇఒ నాగయ్య కోరారు. స్థానిక నందలూరు హైస్కూల్‌లో జరిగిన మండల స్థాయి ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ నిర్వహించారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె హైస్కూల్ హెచ్‌ఎం సి. జయ లలితకుమారి, నందలూర్ హై స్కూల్ ఇన్‌ఛార్జి షేక్ రౌఫ్‌బాషా, వ్యాయామ ఉపాధ్యాయులు విశ్వనాథ్, గౌరి, సుష్మిత, గణేష్, సునీత, సరిత, రత్న, జగన్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.**బి.కొత్తకోట :** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఎంపికలలో భాగంగా చివరి రోజు బుధవారం అథ్లెటిక్స్ పోటీలను అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించారు. నాలుగు కేటగిరీలలో దాదాపు పది ఈవెంట్లకు జరిగిన పోటీలలో 250 మంది బాల, బాలికలు పాల్గొన్నారు .ప్రతి ఈవెంట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఇఒ భీమేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరిలు తెలిపారు. **వాల్మీకిపురం:** స్థానిక పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు బాల్ బాడ్మింటన్, త్రోబాల్, ఖోఖో, లాంగ్ జంప్, డిస్కత్రో పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాల్ బాడ్మింటన్ పోటీల్లో సీనియర్ జట్టుకు చందు, ప్రీతిక, జోషిత రెడ్డి, లిఖిత, జాహ్నవి, జూనియర్ జట్టుకు నవ్య, హిమశ్రీ, భవ్యశ్రీ, రూహి ఫిర్దోస్, మేఘన, జ్ఞానప్రసూనలు ఎంపికైనట్లు తెలిపారు.

ఘనంగా హిందీ భాషాదినోత్సవం

ప్రజాశక్తి-పుల్లంపేట

హిందీ భాషా దినోత్సవం ముందస్తుగా మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ చక్రధర్‌రాజు హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష అంటే కష్టం అనే ఆలోచన అనే తీరు విద్యార్థులు మార్చుకోవాలని సూచించారు. హిందీ భాష అంటే కష్టం కాదు ఇష్టమని తెలిపారు. వాస్తవానికి హిందీ చాలా సులభమైన భాషని త్వరగా నేర్చుకోగల భాష ఏదైనా ఉందంటే అది హిందీ అని తెలిపారు. విద్యార్థులు పోటీలలో పాల్గొనడం అలవాటు చేసుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు కృష్ణమూర్తి వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహువతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలోఎంఇఒ-2 నాగ తిరుమలరావు, పివిజి పల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, పుల్లంపేట మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు భారతి, హిందీ ఉపాధ్యాయులు సయ్యద్‌సర్తాజ్ హుస్సేన్, సురేంద్ర, రామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎడమ కాలువకు నీటి విడుదలపై రైతుల హర్షం

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువకు నీటిని విడుదల చేయడం పై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఏడు కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలలో చెరువులు, కుంటలు నీటితో నిండాయి. కుడికాలువ నుంచి లక్కిరెడ్డిపల్లి వరకు నీరు చేరుతుంది. రైతులకు సమృద్ధిగా నీటిని విడుదల చేస్తున్నట్లు నున్నట్లు వెలిగల్లు ప్రాజెక్టు డిఇ శిరీష్‌కుమార్ పేర్కొన్నారు

హౌసింగ్ బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలి

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలో ఉన్న హౌసింగ్ బిల్లులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఒ చాంబర్లో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ తో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు విషయంలో అలసత్వం లేకుండా ప్రతి ఒక్క లబ్ధిదారునికి నేరుగా ఖాతాలో జమ అయ్యేలా చూడాలన్నారు. ఆధార్ సీడింగ్ గానీ, అకౌంట్ నెంబర్ ఆధార్ కార్డు సీడింగ్ కాలేదని సాకులు చెప్పకుండా లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్క లబ్ధిదారునికి సకాలంలో బిల్లులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ హరిప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలం ఎస్‌టి యానాది కాలనీలో తాగునీటి బోరు రిపేరు వచ్చిందని స్థానిక ప్రజలకు తన దృష్టికి తీసుకవచ్చారని వైసిపి మండల మైనార్టీ నాయకుడు రెహమాన్ ఖాన్ బుధవారం తెలిపారు కాలనీవాసులు చెప్పిన వెంటనే ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి దృష్టికి తీసు కెళ్లినట్లు తెలిపారు. ఆయన వెంటనే స్పందించి తాగునీటి సమస్య పరిష్క రించారని అన్నారు. బోరుకు మరమ్మతులు చేయించి యానాది కాలనీ ప్రజల నీటి సమస్యను పరిష్కరించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

పల్లెల ప్రగతి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రాష్ట్రంలో పల్లసీమల ప్రగతే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ తెలిపారు. బుధవారం తంళ్లపల్లె పంచాయతీలో సర్పంచ్ నీలుఫర్ మైనుద్దిన్, వైస్ ఎంపిపి కరీంల ఆధ్వర్యంలో పల్లెబాట జరిగింది. అధికారులు ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. గ్రామీణ ప్రజలు అభివృద్ధి బాట పట్టినప్పుడే పల్లెల ప్రగతి సాధించినట్లు అవుతుందని ఇందుకు ప్రభుత్వం పలు రకాల సంక్షేమ కార్యక్రమాలతో ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయని, ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపిడిఒ సురేంద్రనాథ్, ఎటిఎం గంగాధర్, నాయకులు రామ్మూర్తి ,మైనుద్దీన్, సుజాత, హరి , శేషాద్రి పాల్గొన్నారు.

చాప్ కట్టర్‌లో పడి తెగిన చేయి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని మల్లెల పంచాయితీ మేకల వారి పల్లెకు చెందిన మహేష్‌బాబు భార్య ఎం.మాలతి (30) రోజు మాదిరిగానే పాడి ఆవులకు పశు గ్రాసం చాప్ కట్టర్ ద్వారా కత్తిరిస్తుండగా ప్రమాదవశాత్తు యంత్రంలో చేయిపడి మహిళా రైతుకు చేయి కట్ అయి తీవ్రంగా గాయపడింది. బాధితురాలని గమనించిన కుటుంబీకులు వెంటనే బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆమె పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.

లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని గుడిపల్లి పంచాయతీలో లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం గుడిపల్లి సర్పంచ్ గిరిజా రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పింఛను నగదుని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం, పార్టీ అని తేడా చూడకుండా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. వచ్చే లోకసభ, శాసనసభ ఎన్నికల్లో ఎంపీగా మిథున్ రెడ్డిని, ఎమ్మెల్యేగా ద్వారకనాథ్‌రెడ్డిని గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటప్ప, పంచాయతీ సెక్రటరీ వై.మానస, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, పింఛనుదారులు, ప్రజలు పాల్గొన్నారు.**నందలూరు:** అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్య నారా యణ అన్నారు. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సచివాలయం-3లో 10 మందికి కొత్తగా ఫిన్షన్ మంజూరు కాగా సర్పంచ్ చేతుల మీదుగా అందిం చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పించన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు అందని వారు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్‌అమీర్, అకేపాటి రమేష్‌రెడ్డి, ఆకులచలపతి, సచి వాలయ వెల్ఫేర్ శారద, విఆర్ఒ రాజు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని రంగంపల్లె పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన పెన్షన్లను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి వేమయ్య , వెల్ఫేర్ అసిస్టెంట్ యశోద ఆధ్వర్యంలో నూతన పెన్షన్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ అనేక కారణాలవల్ల ఎవరికైనా పెన్షన్‌లు ఆగిపోయి ఉంటే తమ దృష్టికి తీసుకొని వస్తే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పెన్షన్ పునరుద్ధరణ చేయడానికి ముందుంటానని తెలిపారు.కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ యశోద, యానాదయ్య సచివాలయ సిబ్బంది వాల్ ఇంటర్లు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు సమావేశాలు ప్రాణం

ప్రజాశక్తి-వీరబల్లి

డ్వాక్రా సంఘాలకు సమావేశాలు ప్రాణమని వైఎస్ఆర్ క్రాంతి పథం మండల సహాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఖాదర్‌వలి తెలిపారు. బుధవారం మట్లి ఎల్లంపల్లి ప్రాథమికపాఠశాలలో జరిగిన మట్లి-1 గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. క్రమంతప్పని సమావేశాల వల్ల స్వయం సహాయక సంఘాలు బలోపేతమవుతాయన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్దిపొందిన వారు జీవనోపాధుల మెరుగు పరుచుకోవడానికి రుణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. సంఘాలు పొదుపులు పెంచుకోవడం వల్ల అధిక రుణాలు ఇప్పిస్తున్నామని, ఆర్థిక లావాదేవీలు క్రమం తప్పక పుస్తకాలలో నమోదు చేసుకోవాలని కోరారు. సంఘాల కార్యకలాపాలలో సభ్యులందరీ భాగస్వామ్యం కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో సిసి సుభద్రమ్మ, విఒఎ చామంతి, సమాఖ్య అధ్యక్షురాలు సుకన్య, కార్యదర్శి మల్లీశ్వరీ, రమణమ్మ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'చింతల' సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-కలికిరి : ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు కలికిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇంద్రమ్మ కాలనీ ఆర్చి వద్ద జడ్‌పిటిసి పద్మజా లోకవర్ధన్, వార్డ్ మెంబర్ వేంపల్లి ఖాదర్‌బాషా, మైనార్టీ జెఎసి అధ్యక్షులు హనీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పుట్టినరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముస్లిం మైనార్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, సీనియర్ నాయకులు నల్లారి తిమ్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేకు కట్ చేసి ఆయనకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రత్నశేఖర్ రెడ్డి, బీసీ నాయకులు వెంకటపతి, మద్దిరాల మల్లికార్జున, ఇస్తియాక్ అహ్మద్,సర్పంచ్ సురేందర్ రెడ్డి, నరేష్, ఎస్టిడి హరి వేంపల్లి బాలాజీ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ :** నియోజకవర్గ అభివృద్ధితో పాటు పేదల సంక్షేమానికి పాటుపడు తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సేవలు ఆదర్శనీయమని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన కలకడ ఆర్‌టిసిబస్టాండ్ ప్రాంగణంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి, అన్నదానం కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రతినిత్యం ప్రజల్లో ఉండి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తూ నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్ వెంకట రమణరెడ్డి వైఎస్ఆర్‌పి నాయకులు కార్యకర్త అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కలికిరి : కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

క్రైం కార్నర్

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

-డిఎస్‌పి మహబూబ్‌బాషా

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విఆర్ఒ ఆంజనేయులునాయుడు హత్యకు వివాహేతర సంబంధమే కారణమని రాయచోటి డిఎస్‌పి మహబూబ్‌బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక అర్బన్ పోలీస్ వీరబల్లి మండలంలో విఆర్ఒగా ఆంజనేయ నాయుడు రాయచోటి పట్టణంలోని కొత్తపేట ప్రకాష్‌నగర్‌లో నివాసముంటున్నారని చెప్పారు. విధుల్లో భాగంగా ఎక్కువగా బయటే ఉండటంతో అతని భార్య నందిని ఒంటరిగా ఉండేదన్నారు. మండలంలోని చెరువు ముందరపల్లి గ్రామం కొత్తపల్లెకు చెందిన చిన్నప్పరెడ్డి ఆమెకు పరిచయం ఏర్పడినట్లు చెప్పారు. ఈ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసిందన్నారు.ఇటీవల భార్య అక్రమ సంబంధం గురించి తెలియడంతో దంపతుల మధ్య గొడవలు జరిగేవని పేర్కొన్నారు. చిన్నప్పరెడ్డికి దూరంగా వుండాలని భార్యను హెచ్చరించినా ఆమె ప్రవర్తనలో మార్పు లేకపోగా భర్తనే అడ్డుతొలగించుకునేందుకు సిద్దమైనట్లు తెలిపారు. తమ అక్రమ బంధానికి అడ్డుగా వున్న భర్త హత్యకు ప్రియుడితో కలిసి కుట్రపడిందన్నారు. గత ఆదివారం ఇంటికి వచ్చిన భర్త అనజనేయలు నాయుడుకు మజ్జిగలో నిద్ర మాత్రలు ఇవ్వడంతో భర్త నిద్ర మత్తులోకి జారుకున్నాడని, ప్రియుడితో కలిసి నిద్రిస్తున్న భర్తను దిండు సహాయంతో గట్టిగ నొక్కడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడని తెలిపారు. చనిపోవాలనే ఉద్దేశ్యంతో ముఖంపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని పేర్కొ న్నారు. బందువులకు ఇంట్లో కాలుజారిపడ్డాడని అందరినీ నమ్మించిందన్నారు. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. భార్య నందిని అదుపులోకి విచారించి పరారీలో ఉన్న ప్రియుడు చిన్నప్పరెడ్డి, చిన్నప్పరెడ్డి సురేంద్రరెడ్డి లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. 48 గంటల్లో కేసును చేదించిన అర్బన్ సిఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ నరసింహారెడ్డి, సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి మహబూబ్‌బాషా